క్లుప్తంగా

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ

విశాఖ లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం రీడింగ్ రూమ్‌లో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ మాట్లాడుతూ బాలకార్మిక చట్టం, కనీస వేతనాల చట్టం మీద ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. ఈ సమావేశంలో కార్మికశాఖ అసిస్టెంటు కమిషనర్ ఎస్.మోహన్‌లక్ష్మి, అసిస్టెంటు లేబర్ ఆఫీసర్లు బి.అరుణ, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.విజయలక్ష్మి, కె.మనోజ్‌కుమార్, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు అపార అవకాశాలు



మహిళా విభాగం సభ్యులతో పైడా కృష్ణప్రసాద్

అల్లిపురం : మహిళా పారిశ్రామిక వేత్తలకు అపార అవకాశాలు ఉన్నాయని, సమయపాలన విషయంలో మహిళలు మెరుగైన పనితీరు కనబరుస్తున్నారని ఏపీ ఛాంబర్స్ ప్రెసిడెంట్ పైడా కృష్ణప్రసాద్ అన్నారు. ఛాంబర్స్ మహిళా పారిశ్రామిక వేత్తల విభాగం ఆధ్వర్యంలో నగరంలోని ఒక హోటల్లో నిర్వహించిన మహిళా సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు అల్లా లీలారాణి మాట్లాడుతూ 20 మంది సభ్యులతో ప్రారంభించిన మహిళా విభాగంలో నేడు 88 మంది ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడిగా పైడా కృష్ణప్రసాద్ పదవీ కాలం సెప్టెంబర్ 9తో ముగుస్తున్న సందర్భంగా మహిళా విభాగం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జి.సాంబశివరావు, యార్లగడ్డ గీత, డాక్టర్ కె.కుమార్‌రాజా, విశాఖపట్నం జోన్ చైర్మన్ కె.ఆర్.బి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ



విశేష అలంకరణలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారు

అల్లిపురం : శ్రావణమాసం ప్రవేశించడంతో నియోజకవర్గంలో దేవాలయాలు శ్రావణ శోభ సంతరించుకున్నాయి. గత రెండు నెలలుగా మౌఢ్యమి, ఆషాఢం, అధిక శ్రావణ మాసాలు కావటంతో ఎటువంటి శుభ ముహూర్తాలు లేక మహిళలు పూజలకు దూరంగా ఉన్నారు. గురువారం నుంచి శ్రావణమాసం ప్రవేశించడంతో టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం, అల్లిపురం శ్రీ అలమేలు మంగమ్మ ఆలయం, మూడుగుళ్ల కనకదుర్గమ్మ ఆలయం, కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం, జెండా చెట్టువీధి విజయ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో తెల్లవారు జాము నుంచి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నేడు శ్రావణమాసం మొదటి శుక్రవారం కావటంతో మొదటి శుక్రవారం పూజలకు మహిళలు సిద్ధమవుతున్నారు.

ప్రపంచ శాంతిపై 20న సదస్సు

మద్దిలపాలెం: డాక్టర్ బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్లో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి అంశంపై సదస్సు జరగనుందని నిర్వాహకుడు నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనే వారు ముందుగా 90324 77463 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఇంటింటా రేషన్‌తో.. వంటిల్లు ఫుల్

గత ప్రభుత్వాలు ప్రజల వద్దకే పాలన అని ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజల ఊసే ఎత్తేవి కాదు. ఈ దశలో పాలనా పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్ష, పారదర్శక పాలన అంటే ఏమిటో చూపించారు. ప్రజలకు ఏం కావాలో అది చేస్తూ సుభిక్ష పాలన ఇదేనని నిరూపించారు.

- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- సుపరిపాలనకు చక్కటి నిదర్శనమని కితాబు



పండా వీధిలో లబ్ధిదారులకు సరకులు పంపిణీ చేస్తున్న రేషన్ వాహనం (ఫైల్)

జగదాంబ : అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. ముఖ్యంగా ప్రజల ముంగిటకే రేషన్ అందజేస్తూ సంక్షేమ సారథిగా కీర్తినందుకుంటున్నారు. గతంలో రేషన్ సరకులు తెచ్చుకోవాలంటే ఎక్కడికో వెళ్లాల్సి వచ్చేది. ఒకపూట పని పోయేది. తర్వాత తెచ్చుకుందాంలే అనుకుంటే ఆ నెల రేషన్ మళ్లీ దొరికేది కాదు. అలాంటి సమస్యలకు చెక్ పెడుతూ సీఎం జగన్ ఇంటి వద్దే లబ్ధిదారులకు రేషన్ అందిస్తున్నారు. కూలీనాలీ చేసుకునే ప్రజలు తమ పనులు నష్టపోకుండా, ఎండావాన బాధ లేకుండా ఇంటి ముంగిటే రేషన్ అందజేస్తున్నారు.

వలంటీర్ల ద్వారా రేషన్ బండి సమాచారం..



ఇంటి ముంగిటకు వచ్చే రేషన్ వాహనం గురించి వలంటీర్ ముందుగా వచ్చి సమాచారం అందిస్తున్నారు. దీంతో ఏదైనా పనిలో ఉన్నవారు అది ముగించుకుని వెళుతున్నారు. చక్కగా రేషన్ తెచ్చుకుంటున్నారు. దూరం నుంచి మోసుకుని రావాల్సిన బాధ లేదు. ఇంటికి దగ్గరలోనే అందజేస్తుండటంతో పిల్లల్ని వదిలేసి వచ్చామనో.. మరొకటో అనుకునే బాధ లేదు.

–రామాయమ్మ, పండావీధి, 35వ వార్డు.

ఇంటి వద్దకు వచ్చి రేషన్ ఇవ్వటం బాగుంది..



గతంలో రేషన్‌కు వెళ్తే షాపు తెరచి ఉండేది కాదు. అలాగని తర్వాత రోజు వెళ్తే రేషన్ అయిపోయింది అనేవారు. దీని వలన ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు జగనన్న ఆ బాధల నుంచి విముక్తి కల్పించారు. మన ఇంటి వద్దకి వచ్చి మరీ రేషన్ అందించటం చాలా బాగుంది. ప్రజల వద్దకు పాలన అంటే ఇదే.

వరలక్ష్మి, దుర్గమాంబ సమాజం, 35వ వార్డు.

మాకు ఉపాధి కల్పించారు..



లబ్ధిదారులకు రేషన్ అందిస్తు నిరుద్యోగులమైన మేము ఉపాధి పొందేలా చేశారు సీఎం జగన్. వార్డుల్లో ఉన్న వీధుల్లోకి మా వాహనం వస్తే చాలు అందరూ రేషన్ తీసుకుంటున్నారు. ఏ ఒక్కరు ఉండిపోయినా వలంటీర్ వెళ్లి తీసుకొచ్చి దగ్గరుండి రేషన్ తీసుకునేలా చేస్తున్నారు.

–రమేష్, రేషన్ వాహనం డ్రైవర్.

వైఎస్సార్‌సీపీదే మళ్లీ అధికారం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

- టైమ్స్ నౌ సర్వే ఫలితాల్లో వెల్లడి
- 24 నుంచి 25 ఎంపీ స్థానాలు గెలుచుకునే దిశగా పయనం
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు నేరుగా అందుతున్న దృష్ట్యా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకునే దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. టైమ్స్ నౌ సర్వే ఫలితాల్లో 25 లోక్‌సభ స్థానాలకు గాను 24 నుంచి 25 స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలుచుకుంటుందని ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం జగదాంబ జంక్షన్ సమీపాన గల మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద టపాసులు పేల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ వెల్ఫేర్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, దక్షిణ నియోజకవర్గ పరిశీలకుడు రామకృష్ణ, పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితర నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రతి రాష్ట్రం ఇక్కడ అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలపైనే చర్చించుకుంటున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన, అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అమలు చేసే దిశగా అడుగులు వేస్తుంటే ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. జూన్ 15 నుంచి ఆగస్టు 12 వరకు టైమ్స్ నౌ చేసిన సర్వేలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 24 నుంచి 25 ఎంపీ స్థానాలు గెలుచుకుంటుందని ప్రకటించడం చూస్తుంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 175కి 175 అసెంబ్లీ స్థానాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎందుకు గెలవదన్నారు. అంతే కాక గత ఎన్నికలకు.. ప్రస్తుతానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటింగ్ శాతం పెరగనుందని (51.3శాతం) ప్రకటించడం చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం విషయానికొస్తే 3వ సారి కూడా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు రామకృష్ణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ వెల్ఫేర్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఒక ఎత్తు అయితే.. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వాసుపల్లి గణేష్‌కుమార్ కూడా మరోసారి ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం ఖాయమన్నారు. పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలో 175కి 175 అసెంబ్లీ స్థానాలు గెలవడం ఖాయమన్నారు. కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, కోడూరు అప్పలరత్నం, బిపిన్‌కుమార్ జైన్, కోడిగుడ్ల పూర్ణిమ, పలు వార్డుల అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, జీసీస్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి అనుగ్రహంతోనే అన్నీ



అన్నసమారాధనలో పాల్గొన్న రాజాపాత్రుడు

అల్లిపురం : అమ్మవారి అనుగ్రహంతోనే అన్నీ సమకూరుతాయని వైజాగ్‌పటం క్లబ్ అధ్యక్షుడు రాజా పాత్రుడు అన్నారు. అమ్మవారి ఆదేశం మేరకు తాను భక్తులకు ప్రసాద వితరణ చేపడుతున్నానని, అందుకు అవకాశం కల్పించిన ఆలయ కమిటీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, బొడ్డేటి ప్రసాద్, వాసుపల్లి నారాయణ, గనగళ్ల సత్యవతి, పంపాన గణేష్, సత్యనారాయణ, బడే నాగరాజు, పాకలపాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

జగదాంబ : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమవుతుందని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. గురువారం వార్డులో రూ. 9 కోట్లతో విశాఖ మదీనా హౌలియ దర్గా షరీఫ్ వరకు బైరవ మఠం రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేవలం నాలుగు సంవత్సరాల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రహదారులు, కాలువలు, బాలికల పాఠశాలల అభివృద్ధి, బాబూలాల్ జిమ్ నిర్మాణం, మత్స్యకారుల భవనం, షాదీఖానా మరమ్మతులకు నిధుల మంజూరు వంటి కార్యక్రమాలతో సంక్షేమ పాలన అందిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుని మరింత అభివృద్ధికి పాటు పడదామని సాధిక్ అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

150వ రోజుకు చేరుకున్న రూ. 10 భోజనం



ఆస్పత్రిలో భోజనాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, ఆదిత్య కల్యాణ్

మహారాణిపేట : వాల్తేర్ రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు అందజేస్తున్న రూ. 10 భోజన పంపిణీ కార్యక్రమం గురువారంతో 150 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ సీఎం ఏ జహీర్ అహ్మద్, రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ చైర్మన్ కల్యాణ్ అదిత్య, సభ్యుడు రవి నల్లమోతు, డాక్టర్ మక్సూద్ అహ్మద్ తదితరులు గురువారం భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ విజయవంతంగా 150 రోజుల పాటు రూ. 10 భోజనాలు అందించిందన్నారు. చక్కటి కార్యక్రమం నిర్వహించినందుకు రౌండ్ టేబుల్ ఇండియా సంస్థకు కృతజ్ఞతలు చెబుతున్నామని అన్నారు. అలాగే మరి కొంత మంది దాతలు ముందుకు వచ్చి ఘోషాస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు భోజనాలు అందించాలని అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో పూజా రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 15 వరకు శ్రావణం పూజలు

దేవస్థానంలో వచ్చే నెల 15 వరకు శ్రావణలక్ష్మి పూజలు నిర్వహిస్తున్నామని.. పూజకు అవసరమయ్యే సామగ్రిని దేవస్థానమే సమకూరుస్తుందని ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గురు/శుక్రవారాలు మినహా ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు, గురు/శుక్రవారాల్లో రెండు బ్యాచ్‌లుగా ఉదయం 8 నుంచి 9, 9.30 నుంచి 10.30 గంటలకు పూజలు నిర్వహిస్తామన్నారు. పరోక్షంగా పూజ చేసే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాతా నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081కు జమ చేసి, పేరు, గోత్రం, చిరునామా వివరాలను 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయవచ్చని ఈవో వెల్లడించారు.

ప్రాథమిక పరీక్షలతో క్యాన్సర్ నిర్మూలన



డాక్టర్ మురళీకృష్ణతో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాంబాబు తదితరులు

విశాఖ లీగల్ : అవగాహన, ప్రాథమిక పరీక్ష ద్వారా క్యాన్సర్ వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చునని ప్రముఖ అంకాలజిస్ట్, మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి. మురళీకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం జిల్లా కోర్టు గ్రంథాలయంలో విశాఖ న్యాయవాదులు ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ మంచి ఆహారం, తొలి దశలో ప్రాథమిక పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. 40 ఏళ్లు దాటిన మహిళలు, 50 ఏళ్లు దాటిన పురుషులు క్యాన్సర్ వ్యాధికి సంబంధించి ప్రాథమిక పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. అనంతరం న్యాయవాదులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు లత డాక్టర్ మురళీకృష్ణను ఘనంగా సన్మానించారు.

అరుదైన శస్త్ర చికిత్సతో చిన్నారికి ప్రాణభిక్ష



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవితేజ

మహారాణిపేట : ప్రమాదవశాత్తు భవనంపై నుంచి జారిపడి కొన ఊపిరితో ఉన్న ఆరేళ్ల చిన్నారికి ఆంధ్రా ఆస్పత్రి వైద్య బృందం అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడింది. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ విశ్వతేజ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ మురళీధర్, ఏనస్తీషియన్ డాక్టర్ కార్తీక్ శస్త్ర చికిత్స వివరాలు వెల్లడించారు. చికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యంగా ఉండడంతో గురువారం డిశ్చార్జి చేశారు. ఈనెల 7వ తేదీన విజయనగరం జిల్లాకి చెందిన ఆరేళ్ల చరణ్ ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడిపోయాడు. చరణ్ తండ్రి సూరి అప్పన్న ఆంధ్రా ఆస్పత్రికి తీసుకు వచ్చారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న చరణ్‌కు అదే రోజు రాత్రి శస్త్ర చికిత్స నిర్వహించారు. చికిత్స అనంతరం ఎంతకూ రక్తస్రావం ఆగకపోవడంతో వైద్యులు మళ్లీ చికిత్స కొనసాగించి చరణ్ ప్రాణాలు కాపాడారు. రోగి వచ్చిన తర్వాత కడుపు, ఛాతీలో రక్తం ఆగకుండా వచ్చింది. ఈ పరిస్థితిలో లివర్ కొద్దిగా దెబ్బతింది. నెఫ్రాలజిస్టు డాక్టర్ రమ్య, డాక్టర్ మురళీధర్ సహకారంతో అరుదైన శస్త్ర చికిత్స చేసి చరణ్ ప్రాణాలు కాపాడామని డాక్టర్ రవితేజ వివరించారు. చిన్నారి తండ్రి సూరి అప్పన్న మాట్లాడుతూ తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టిన ఆంధ్రా ఆస్పత్రి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులు మాళవిక, పద్మ తదితరులు పాల్గొన్నారు.

శివాలయ హుండీ ఆదాయం రూ.2.26 లక్షలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పర్యవేక్షణాధికారి పి.ఎల్.ఎస్.రాజు ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు పర్యవేక్షణలో గురువారం హుండీల ఆదాయం లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 140 రోజులకు గానూ రూ.2,26,113 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, శ్రీహరి సేవకులు పాల్గొన్నారు.

రైతుబజార్‌కు శ్రావణ శోభ

సీతమ్మధార: మొదటి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సీతమ్మధార రైతుబజార్ వినియోగదారులతో కిటకిటలాడింది. గురువారం సాయంత్రం బజారులో పండ్లు, పూలు, మామిడి కొమ్మలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, అరిటాకులు, చెరుకు గడలతో పాటు ఇతర పూజా సామగ్రి కొనుగోలు చేశారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ పర్యవేక్షించారు.

సచివాలయ కన్వీనర్లకు బీమా



జేసీఎస్ బీమా శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు



శిబిరంలో పాల్గొన్న గృహసారథులు, కన్వీనర్లు

డాబాగార్డెన్స్ : జేసీఎస్ ఇన్సూరెన్స్ నమోదు శిబిరం గురువారం దక్షిణ నియోజకవర్గ పరిధి 29వ వార్డు అంబికాబాగ్ రామాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు (జేసీఎస్) ఇటీవల జగనన్నే మా భవిష్యత్, జగనన్న సురక్ష వంటి ప్రచార కార్యక్రమాలు విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. జేసీఎస్ నెట్‌వర్క్‌ని ప్రవేశపెట్టినప్పుడు వారికి బీమా అందిస్తామని చెప్పిన విషయం తెలిసిందేనన్నారు. ఆ దిశగా ఇప్పుడు అడుగులు వేస్తున్న తరుణంలో జేసీఎస్ క్యాడర్ల వివరాలు ధ్రువీకరించి, యాప్‌లో అప్‌లోడ్ చేసి మొత్తం కేడర్‌కు బీమా అందించాన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 10 వరకు జేసీఎస్ నమోదు శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ శిబిరాన్ని వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ పరిశీలకుడు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, ద్రోణంరాజు శ్రీవత్సవ్, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, బిపిన్‌కుమార్ జైన్, కోడిగుడ్ల పూర్ణిమ, కోడూరు అప్పలరత్నం, పలు వార్డుల అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, పార్టీ సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సమ్మయ్య మృతిపై విచారణ చేపట్టాలి

కుటుంబ సభ్యుల డిమాండ్



మృతుడు తమ్మయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

అల్లిపురం : సముద్రంలో వేటకు వెళ్లిన సూరాడ తమ్మయ్య బోటులో ఉండగా ఆకస్మికంగా మరణించిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, న్యాయం చేయాలంటూ 38వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకురాలు బెహరా వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఈ నెల 6వ తేదీన వేటకు వెళ్లిన వ్యక్తి 16వ తేదీ ఉదయం ఫోన్ చేసి జ్వరంగా ఉందని కుటుంబ సభ్యులకు తెలియజేశాడన్నారు. బోటులో ఉన్న మందులు వేసుకోవాలని కుటుంబ సభ్యులు చెప్పిన గంట వ్యవధిలోనే తమ్మయ్య మృతి చెందినట్లు బోటు యజమానులు ఎర్రయ్య, సత్తిబాబు తెలిపారని వివరించారు. చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని బుధవారం రాత్రి వరకు అందించలేదన్నారు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు స్వీకరించలేదని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేయగా గురువారం ఉదయం 6 గంటలకు ఫిషింగ్ హార్బర్‌కు పోలీసులు వచ్చి వివరాలు సేకరించారన్నారు. ఈ విషయమై బోటు యజమానులపై ఆమె అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు తక్షణమే విచారణ చేపట్టి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో డాక్టర్ మోహన్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో సుమారు 200 మందికి బీపీ, సుగర్ పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రతిరోజూ వాకింగ్‌తో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆహారంలో ఎక్కువగా చిరుధాన్యాలు, ఆకుకూరలు వంటివి తీసుకుంటే మంచిదని సూచించారు. ఉదయం నుంచి మందిరంలో బాబాకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం ప్రత్యేక అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సంధ్యాహారతి అనంతరం మహిళా భక్తుల పల్లకీ సేవ, బాబా భజన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో రిజ్వాన్, సోఫియా, ప్రసాద్‌లతోపాటు ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.